

కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేస్తున్న ఎస్ఈ వేణు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

# కూడవెల్లి వాగులోకి నీటి విడుదల

గజ్వేల్, ఫిబ్రవరి 2: రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరం జలాలను కూడవెల్లి వాగులోకి వదిలామని ఎస్ఈ వేణు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కొడకండ్ల వద్ద కొండపోచమ్మ కెనాల్ ద్వారా కూడవెల్లి వాగులోకి గోదావరి జలాలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నీటిని విడుదల చేయించిందన్నారు. గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల పరిధిలోని రైతుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం కూడవెల్లి వాగును గోదావరి జలాలతో నింపేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. కూడవెల్లి వాగు పరిసర ప్రాంతాల్లో రైతులు వేలాది ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, నాయకులు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# హల్దీవాగులోకి నీటిని విడుదల చేయాలి

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్‌అర్బన్, ఫిబ్రవరి 2: కొండపోచమ్మ ప్రాజెక్ట్ సంగారెడ్డి కెనాల్ ద్వారా హల్దీ వాగులోకి గోదావరి జలాలు విడుదల చేసి సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల రైతులు సాగు చేస్తున్న పంటలను కాపాడాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కోరారు. శుక్రవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడారు. భూగర్భ జలాలు తగ్గుతుండడంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని, వెంటనే హల్దీ వాగులోకి నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. కేసీఆర్ హయాంలో హల్దీవాగులోకి నీటిని విడుదల చేసి పొలాలకు సాగునీరు అందించారన్నారు. కేసీఆర్ భగీరథ ప్రయత్నం వల్లే కొండపోచమ్మ, మల్లన్నసాగర్ రిజర్వాయర్లు జలబాంఢాగారాలుగా మారాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండు, మూడు పంటలు సాగు చేసి రైతులు ఆర్థిక ప్రగతి సాధించారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈసారి రాష్ట్రంలో 40శాతం మంది రైతులు నాట్లు వేయలేదని పేర్కొన్నారు.



సిద్దిపేటరూరల్: అడిషనల్ కలెక్టర్‌కు పూలతో స్వాగతం పలుకుతున్న కూలీలు

# ఘనంగా ఉపాధిహామీ దినోత్సవం

సిద్దిపేటరూరల్/ అక్కన్నపేట/ వర్గల్/ మద్దూరు(ధూళిమిట్ట)/ రాయపోల్, ఫిబ్రవరి 2: సిద్దిపేట రూరల్ మండలంలోని చిన్నగుండవెల్లిలో శుక్రవారం ఉపాధి దినోత్సవం నిర్వహించారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీడీఓ రాఘవేందర్‌రెడ్డి ఉపాధి పనుల తీరు గురించి వివరించారు. అక్కన్నపేట మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ దినోత్సవంలో ఉపాధి హామీ కూలీలు పని చేసేచోట సౌకర్యాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ కోరారు. వర్గల్ మండలం గౌరారంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ దినోత్సవాన్ని కూలీలు ఘనంగా జరుపుకొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్ అన్నారు. శుక్రవారం ఉపాధి హామీ పథకం దినోత్సవాన్ని నిర్వహించారు. రాయపోల్ మండల కేంద్రంలో అధికారులు ఉపాధి హామీ కూలీలు ఘనంగా ఉపాధి హామీ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీ ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**ఉద్యోగులకు పేస్కేల్ సంతోషకరం**

మిరుదొడ్డి, ఫిబ్రవరి 2: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకం ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి పేస్కేల్ అమలు చేయడం సంతోషంగా ఉందని ఎన్ఆర్ఈజీఎస్ పథకం మిరుదొడ్డి ఏపీవో కొండల్‌రెడ్డి అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పేస్కేల్ అమలు చేస్తున్నట్లు ప్రకటన చేయడంతో శుక్రవారం మిరుదొడ్డిలో అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఏండ్లుగా ఎదురుచూస్తున్న కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 2: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని దుబ్బాక సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన శుక్రవారం మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలున్నా నేరుగా సమాచారం అందించి పరిష్కరించుకోవాలని సూచించారు. దుబ్బాక సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల సాయిలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశం, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గజ్వేల్‌అర్బన్, ఫిబ్రవరి 2: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ 3వ వార్డులో అనారోగ్యంతో మృతిచెందిన సత్తయ్య కుటుంబ సభ్యులకు స్థానిక కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మి కనకయ్య శుక్రవారం ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రమేశ్

# గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

- జిల్లా పరిషత్ సీఈవో రమేశ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 2: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాభివృద్ధిలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు భాగస్వాములు కావాలని జిల్లా పరిషత్ సీఈవో రమేశ్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన స్పెషలాఫీసర్లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణా సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయినందున ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించిందని, వీరు తమకు అప్పగించిన గ్రామాల్లో పనులను సజావుగా సాగేలా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో జరిగే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం తగదని, నర్సరీల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వీధి దీపాల ఏర్పాటు, రోడ్లు, వీధులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామ పాలన విషయంలో ఏ అనుమానం ఉన్నా వెంటనే జిల్లా అధికారులను సంప్రదించి ముందుకుపోవాలని సూచించారు. సమావేశంలో డీఎల్‌పీవో వీరభద్రయ్య, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డి, ఎంపీవో సత్యనారాయణ, గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

## జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి



గజ్వేల్: సర్పంచ్, ఉప సర్పంచ్‌లను సన్మానించిన ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

గజ్వేల్, ఫిబ్రవరి 2: కేసీఆర్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధిలో పరుగులు పెట్టాయని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్ జడ్పీటీసీ పంగ మల్లేశం ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్, పంచాయతీ భవనాలు, క్రీడాప్రాంగణాలు, సిటిజన్ భవనాలు, మౌలిక వసతులకు పెద్దపీట వేయడంతో గ్రామాల్లో కోట్లాది రూపాయల పనులు వేగవంతంగా జరిగాయన్నారు. కేసీఆర్, హరీశ్‌రావుల కృషితో సిద్దిపేట జిల్లాలోని గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు చంద్రమోహన్‌రెడ్డి, మద్దిరాజరెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

**దుళిమిట్టలో..**

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 2: మద్దూరు తాజా మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డిని గ్రామస్తులు సన్మానించారు. ఎంపీటీసీ కనకమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ ఐదేండ్ల వ్యవధిలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లినట్లు చెప్పారు. సమావేశంలో ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ ఆరీఫ్, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మజీద్‌పల్లిలో...**

వర్గల్, ఫిబ్రవరి 2: కేసీఆర్ హయాంలోనే గ్రామాలు ప్రగతిబాట పట్టాయని వర్గల్ ఎంపీపీ లతారమేశ్‌గౌడ్ అన్నారు. మజీద్‌పల్లిలో సర్పంచ్ లతాశివరాంగౌడ్, పంచాయతీ వార్డు సభ్యులను గ్రామస్తుల ఆధ్వర్యంలో సన్మానించారు.

**రాంసాగర్‌లో..**

కొమురవెల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని రాంగసాగర్ సర్పంచ్ రవీందర్‌ను కొమురవెల్లిలో సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నాయకులు కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, సాయిలు, మల్లేశం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**సర్పంచ్‌ల సేవలు మరువలేనివి**

చేర్యాల, ఫిబ్రవరి 2: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర మరువలేనిదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఉల్లెంగల సేవా ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగల ఏకానందం అన్నారు. మండలంలోని 18 గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




మద్దూరు సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు



భూంపల్లి పాఠశాలకు విరాళం ఇస్తున్న ఉపాధ్యాయ దంపతులు

# పాఠశాలకు విరాళం

మిరుదొడ్డి(అక్బర్‌పేట–భూంపల్లి), ఫిబ్రవరి 2: అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో గతంలో విద్యనభ్యసించి ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించిన దంపతులు కమ్మరి హరికృష్ణ, అతడి సతీమణి రాధాపద్మజ శుక్రవారం పాఠశాల అభివృద్ధికి రూ. 20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పదిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి



చేర్యాల: సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 2: పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ముస్త్యాల మోడల్ స్కూల్‌లో చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట మండలాలను కలిపి సబ్ డివిజన్ లెవల్ హైస్కూల్ హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డీఈవో మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి ప్రోగ్రాంలను ప్రతి పాఠశాలలో వందశాతం నిర్వహించాలన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులను సాధించి సిద్దిపేట జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఎంఈవో నర్సింహారెడ్డి, ఎంఎన్‌వోలు కిష్టయ్య, మీనాంజనేయులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు హెచ్‌ఎం ఐలయ్య, రాకేశ్‌రెడ్డి, బల్ల శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, మూడు మండలాల హెచ్‌ఎంలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేక తరగతులు నిర్వహించాలి**

హుస్నాబాద్, ఫిబ్రవరి 2: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని టీఎస్ మోడల్ స్కూల్‌లో జరిగిన హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశానికి హాజరయ్యారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలన్నారు. సమావేశంలో జిల్లా సెక్టోరియల్ అధికారి బేతి భాస్కర్, నోడల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ నోడల్ అధికారులు, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# 'గణితం'లో ప్రావీణ్యం సాధించాలి

హుస్నాబాద్/చేర్యాల/అక్కన్నపేట/కొండపాక/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 2: ప్రతి విద్యార్థి గణితం సబ్జెక్టులో ప్రావీణ్యం సాధిస్తే మిగతా విషయాలపైకూడా అవగాహన ఏర్పడుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో డివిజన్ గణితఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏండ్లుగా హుస్నాబాద్ ప్రాంతంలో గణిత ఫోరం ప్రతినిధులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చేర్యాల మండల స్థాయి గణిత శాస్త్ర టాలెంట్ టెస్ట్ శుక్రవారం ముస్త్యాల మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిల్ దుర్గాప్రసాద్ బహుమతులు అందజేశారు. గణితం జీవితంలో ఒక భాగమని కొండపాక మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బి.విటల్ నాయక్ అధ్యక్షతన మండల స్థాయి గణితంపై టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు గణితంపై శ్రద్ధ చూపితే మేధస్సు పెరుగుతుందని పీఆర్టీయూ జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన గణిత టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



హుస్నాబాద్: బహుమతి పొందిన విద్యార్థులతో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు

## రేపు సీఓఈ సెట్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 2: సిద్దిపేట జిల్లాలోని ఎనిమిది గురుకుల పాఠశాలల్లో ఆదివారం సీఓఈ సెట్ ప్రవేశ పరీక్ష ఉంటుందని సిద్దిపేట జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి నిర్మల శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు https://tswreiscoecet. cgg. gov.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు చూపిన ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

## పుస్తక సమీక్షలో జక్కాపూర్ విద్యార్థిని ప్రతిభ



ధనలక్ష్మి

నారాయణరావుపేట, ఫిబ్రవరి 2: ఉరిమళ్ల ఫౌండేషన్, ఖమ్మం వారు నిర్వహించిన జాతీయ స్థాయి పుస్తక సమీక్షల పోటీలో మండల పరిధిలోని జక్కాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కర్రె ధనలక్ష్మి విజేతగా నిలించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ షౌకత్‌అలీ తెలిపారు. 200మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో ధనలక్ష్మి రాసిన 'రామసక్కని గాలిపటం' అనే బాలల కథల పుస్తకంపై సమీక్ష రాసి విజేతగా నిలిచిందని పేర్కొన్నారు. ధనలక్ష్మిని ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు దుర్గయ్యను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



మాట్లాడుతున్న జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ నాయకులు

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

దుబ్బాక, ఫిబ్రవరి 2: కాంగ్రెస్ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని దుబ్బాక జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం దుబ్బాకలో విలేకరులతో మాట్లాడుతూ.. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని మండిపడ్డారు. కూడవెల్లి వాగులోకి నీరు విడుదల చేయాలని రైతులు రోడ్డెక్కి ధర్నా చేసేంత వరకు నీరు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలోనూ ప్రొటోకాల్ పాటించకపోవడం సిగ్గుచేట్నారు. ఎమ్మెల్యేకు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా నీరు విడుదల చేయటం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బనాల శ్రీనివాస్, నాయకులు సంగం ప్రభాకర్, దేవరాజ్, యాదగిరి నవీన్, వరప్రసాద్ తదితరులున్నారు.



ప్రత్యేకాధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ జయదేవ్

# పారదర్శక పాలన అందించాలి

గజ్వేల్, ఫిబ్రవరి 2: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన పారదర్శకంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ అన్నారు. శుక్రవారం గజ్వేల్ ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులకు పంచాయతీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవీకాలం ఐదేండ్లు పూర్తవడంతో పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించిందన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా నడుచుకొని గ్రామాలభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి అవసరాలను తీర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మచ్చేందర్, తహసీల్దార్ బాల్‌రాజు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌పై కసరత్తు

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 2: హుస్నాబాద్ మున్సిపల్ 2024–25 సంవత్సరానికి ప్రత్యేక బడ్జెట్ రూపకల్పనపై కమిషనర్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గతేడాది ప్రవేశపెట్టిన బడ్జెట్ మాదిరిగా కాకుండా వాస్తవికతను దృష్టిలో పెట్టుకొని తయారు చేయాలని కలెక్టర్ ఇటీవల మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఎంఆర్ రాజశేఖర్, ఏఈ సాయి ప్రణీత్, ఇన్‌చార్జి మేనేజర్ కృష్ణ తదితరులతో సమావేశమయ్యారు. త్వరలోనే బడ్జెట్ ఆమోదం కోసం ప్రత్యేకంగా మున్సిపల్ పాలకవర్గం సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

## మహిళల రక్షణకు చర్యలు

చేర్యాల, ఫిబ్రవరి 2: మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చేర్యాల ఎస్సై దామోదర్ తెలిపారు. శుక్రవారం చేర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణ, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, షీటీమ్ ప్రాముఖ్యత, ఈవ్ టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, ఎవరికైనా ఎలాంటి ఇబ్బంది కలిగినా నేరుగా పోలీస్‌స్టేషన్‌లో గానీ, డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, షీటీమ్ సభ్యులు సదయ్య, మహిళా కానిస్టేబుళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'డబుల్' ఇండ్లు ఇవ్వాలి

గజ్వేల్, ఫిబ్రవరి 2: మున్సిపల్ పరిధిలో అర్హులైన వారందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రభుత్వం వెంటనే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎల్లయ్య కోరారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో లక్కీడ్రా పద్ధతిలో ఎంపిక చేసినవారికి వెంటనే ఇండ్లను కేటాయించాలన్నారు. అందులో అనర్హులుంటే తొలగించి అర్హులకు అవకాశం కల్పించాలన్నారు. అధికారులు ప్రకటించిన జాబితాలో సుమారు 300మంది అనర్హులున్నారని, వారిని తొలగించి దివ్యాంగులు, పేదలు, ఇండ్లులేని వారికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తలకొక్కుల పద్మ, నర్సింలు, మహేందర్, కవిత, లక్ష్మి, నరహరి, నరేందర్, జ్యోతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

# కాలేజీలో వసతులు కల్పించాలి

- ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వివేక్ వర్ధన్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 2: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయని, ఇటీవల జరిగిన సెమిస్టర్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సిద్దిపేట ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వివేక్‌వర్ధన్ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకమైన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు ఉన్నత విద్య మండలి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రీవాల్యుయేషన్ చెల్లించే సమయంలో విద్యార్థుల నుంచి అధిక రుసుము వసూలు చేస్తున్నారని అధ్యాపకుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ విషయమై ప్రిన్సిపల్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు చరణ్, హరీశ్, పరశురామ్, కౌశిక్, సంతోష్, స్వప్న, శృతి ఉన్నారు.

# సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

హుస్నాబాద్, ఫిబ్రవరి 2: హుస్నాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారుల్లోని దుకాణాల వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ తోట మహేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పోలీస్ సిబ్బందితో కలిసి ప్రతి దుకాణానికి వెళ్లి దుకాణాదారుకు సీసీ కెమెరాల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రతి దుకాణదారుడికి నోటీసు అందజేశారు. ఇటీవల జరుగుతున్న దొంగతనాల నేపథ్యంలో సీసీ కెమెరాల ఏర్పాటును తప్పనిసరి చేస్తూ పోలీసులు ప్రచారం ముమ్మరం చేశారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 2: గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మండల ప్రత్యేక అధికారులు అందుబాటులో ఉండాలని ఎంపీపీ బాలేశంగౌడ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. సర్పంచ్‌ల ఐదేండ్ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పట్టాభిరామారావు, ఎంపీవో శ్రీనివాసవర్మ, డీటీ రఘువీరారెడ్డి, ఏవో వసంతరావు, ఏఈ తిరుమల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు పాల్గొన్నారు.

## కల్వర్టుకు ఢీకొని యువకుడు మృతి

బెజ్జంకి, ఫిబ్రవరి 2: మండల కేంద్రానికి చెందిన బండిపల్లి శ్రీనివాస్(25) బైక్‌పై వెళ్తూ కల్వర్టును ఢీకొని మృతిచెందినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. శుక్రవారం శ్రీనివాస్ బైక్‌పై వెళ్తున్న సమయంలో గుండారం వెళ్లే రోడ్డుపై గల కల్వర్టుకు ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి పరశురాములు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

# పొట్లపల్లి జాతరలో దుకాణాలకు వేలం

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లకు సంబంధించి ఆలయ అలంకరణ, డెకరేషన్ లైట్ల ఏర్పాటు, ఆలయ ఆవరణలో పులిహోర, లడ్డూ విక్రయానికి సంబంధించిన దుకాణాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించినట్లు ఈవో కిషన్‌రావు తెలిపారు. ఆలయం ఆవరణలో సంవత్సరంపాటు లడ్డూ, పులిహోర విక్రయానికి సంబంధించిన హక్కులను రూ.16లక్షలకు పోగుల అనిత దక్కించుకున్నట్లు పేర్కొన్నారు.